క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఒకేషనల్ ఈటీ కోర్సుకు బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రు లీలాశ్రీదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీటెక్ (ఈఈఈ) అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 16న ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. డెమో క్లాస్ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొత్తపల్లి: మండలంలో ఇటీవల పలువురు మృతి చెందారు. ఆ కుటుంబాలను సోమవారం మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్చార్జి వంగా గీత పరామర్శించారు. పాత ఇసుకపల్లి గ్రామానికి చెందిన ఏనుగుపల్లి లక్ష్మి, వాకతిప్ప గ్రామానికి చెందిన శివకార్తీక్, పొన్నాడ శివారు కోనపాపేట గ్రామానికి చెందిన కోరాడ బాగిల్తి, చొక్కా తాతారావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కారే శ్రీనివాసరావు, రావు చెన్నారావు, ఇసుకపల్లి సర్పంచులు రిబ్కా, తమిశెట్టి సుబ్బారెడ్డి, ఏ రకం దివాకర్‌రెడ్డి, కుత నాగిరెడ్డి, గొర్ల పోతన్న, అనిశెట్టి లావారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ వివరాలను ఆన్‌లైన్ చేయాలంటూ నిరసన



భూ వివరాలను ఆన్‌లైన్ చేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కాకినాడ సిటీ: ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాథపురంలో ఉన్న 80 ఎకరాల భూమి వివరాలను ఆన్‌లైన్ చేయాలంటూ ఆ భూమిని సాగు చేసుకుంటున్న రైతులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ భూమిని 70 మంది రైతులు 60 ఏళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో ఉండేదని, ఏడాది కిందట రీసర్వేలో ఆన్‌లైన్‌లోని అడంగల్‌లో నమోదు కాలేదని రైతులు అన్నారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా సమస్య పరిష్కారం అవ్వడం లేదన్నారు. ఈ సమస్య జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ పరిధిలో ఉంటుందని, ఆయనే సమస్యను పరిష్కరిస్తారని చెప్పడంతో కలెక్టరేట్‌కు వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 1బీ అడంగల్‌లో నమోదు కాని కారణంగా తమకు వ్యవసాయం చేసుకునే నిమిత్తం రుణాలను బ్యాంకులు మంజూరు చేయడం లేదని రైతులు వాపోయారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించి అడంగల్ 1బీలో నమోదు చేయించాలని కోరారు. అనంతరం జేసీ రాహుల్ మీనాను కలసి వినతిపత్రం అందజేశారు.

నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన

కాకినాడ సిటీ: నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెను విజయవంతం చేసిన కార్మిక వర్గానికి కేంద్ర కార్మిక సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం కాకినాడ కచేరిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశంలో పలువురు కేంద్ర కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లు దేశంలో అమలు జరిగితే భద్రత కలిగిన ఉద్యోగులు సైతం అసంఘటిత రంగ కార్మికులుగా మారాల్సి వస్తుందన్నారు. సుమారు మూడు కోట్ల మంది గిగ్ వర్కర్లు, స్కీమ్ వర్కర్లు కార్మిక చట్టాల నుంచి తొలగించబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులైతే బానిసల కంటే దారుణంగా శ్రమ దోపిడీకి గురవుతారన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలసీల పట్ల కార్మికులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సమావేశం హెచ్చరించింది. సమావేశంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు తోకల ప్రసాద్, దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, తాళ్లూరి రాజు, గొడుగు సత్యనారాయణ, జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గండి ప్రభావంతో గత ఏడాది సెప్టెంబర్‌లో నీట మునిగిన ఇసుకపల్లి గ్రామం, పంట పొలాలు



మాధవపురం వద్ద కాలువకు పడిన గండి

నిర్లక్ష్యాన్ని కడగండి

- ముంచుకొస్తున్న వరదల సీజన్
- ప్రమాదకర గండిని పట్టించుకోని అధికారులు
- వెయ్యి ఎకరాలకు పొంచి ఉన్న ముప్పు

పిఠాపురం: గత అనుభవాలు పాఠాలు నేర్పుతాయనేది సామెత.. ఎంత జరిగినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా అధికారులకు చీమకుట్టినట్లు లేదు. గత ఏడాది వచ్చిన వరదల్లో పంట కాలువకు గండి పడడంతో వెయ్యి ఎకరాల్లో పచ్చని పంటలు నీట మునిగాయి. గ్రామాలు నీట చిక్కుకున్నాయి. ప్రస్తుతం వరదలు వస్తున్నాయి. అదేచోట ప్రమాదకరంగా ఉందని రైతులు పదే పదే చెబుతున్నా అధికారులు పట్టించుకోడం లేదు. దీంతో ఈ ఏడాది కూడా తాము పంటలు సాగు చేసే అవకాశం లేదని, ఒకవేళ ముందుకు వెళ్లినా ఏక్షణంలోనైనా వరద వస్తే మొత్తం కొట్టుకుపోతుందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాదైనా గండిని పూడ్చి తమ సమస్య పరిష్కరిస్తారని చూసినా, ఎవరూ పట్టించుకోడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పిఠాపురం మండలం మాధవపురానికి, కొత్తపల్లి మండలం ఇసుకపల్లికి మధ్యలో ఉన్న పంట కాలువపై సుమారు వెయ్యి ఎకరాల సాగు జరుగుతోంది. ఇందులో మాధవపురంతో పాటు కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి, కొత్త ఇసుకపల్లి, నాగులాపల్లి రమణక్కపేట, యండపల్లి, అమీనాబాద్ తదితర గ్రామాల్లోని పంట పొలాలు ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన ఏలేరు వరద ప్రభావంతో పిఠాపురం మండలం మాధవపురానికి, కొత్తపల్లి మండలం ఇసుకపల్లికి మధ్యలో పిఠాపురం నాగులాపల్లి రోడ్డును ఆనుకుని కాలువకు గండి పడింది. దీని ప్రభావంతో వందల ఎకరాల పంట పొలాలు, ఇసుకపల్లి గ్రామాలు నీట మునిగాయి. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అటువంటి ప్రమాదకరమైన గండిని పూడ్చి ప్రమాదాన్ని నివారించాలని కొన్ని రోజులుగా రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినప్పటికీ ఏఒక్క అధికారి పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇటీవల పీబీసీ, ఏలేరు పరిధిలో కాలువల అభివృద్ధి పేరుతో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్న అధికారులు, కూటమి నేతలు ఈ గండి గురించి మాత్రం నోరు మెదపడం లేదంటున్నారు. దీంతో వరదలు వస్తే తమ పంటలు కొట్టుకుపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నిసార్లు చెప్పినా..



ఈ గండిని పూడ్చి మా పంటలు కాపాడండంటూ ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోడం లేదు. ఇది పెద్ద గండి కాదని అధికారులు అంటున్నారు. దీనివల్ల ఊళ్లకు ఊళ్లు, వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయన్న విషయాన్ని గుర్తించాలి. వరద వస్తే ఏలేరు అదనపు జలాలు, పీబీసీ నీరు ఒకేసారి వచ్చి పడడం వల్ల ఈ కాలువపై భారం పెరుగుతుంది. నీటి ఉధృతి వల్ల గండి పడింది. అలాంటి గండిని పెద్ద గండి కాదనడం సరికాదు. ప్రస్తుతం దీనిని పూడ్చి గట్టు పటిష్టం చేయకపోతే పలు గ్రామాల్లో వేల ఎకరాలు నీట మునగడం ఖాయం.

-వై.ప్రసాదరెడ్డి, రైతు, నాగులాపల్లి

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ అధికారులకు మండల స్థాయిలో మిషన్ వాత్సల పథకంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత అని అన్నారు. 18 ఏళ్లలోపు వారికి వివాహ సర్టిఫికెట్లు జారీ చేస్తే సదరు ఉద్యోగులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098కు సమాచారం అందించాలన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ బాల్య వివాహాలు సామాజిక రుగ్మతగా భావించాలన్నారు. పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.ఉషా మాట్లాడుతూ బాలల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడానికి నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. సీఐ ఎ.కృష్ణభగవాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమాదేవి, ఎండీ సుల్తాన్ బీబీ, క్లాప్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ లక్ష్మి, వార్డు అడ్మిన్లు, రెవెన్యూ అధికారులు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కౌన్సిలర్ కృష్ణ మృతి



సామర్లకోట: స్థానిక శెట్టిబలిజపేటకు చెందిన సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ (55) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. నాలుగు పర్యాయాలు కౌన్సిలర్‌గా పోటీ చేయగా, రెండు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ నుంచి, ఒక పర్యాయం గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి ఎన్నికై ప్రస్తుతం కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. తర్వాత కృష్ణను టీడీపీలోకి చేర్చుకున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. సోమవారం కృష్ణ పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్లు సేపెని సురేష్, బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు సందర్శించారు.

రైతులను ముంచుతున్న 'కూటమి'

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



పాడా కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న వంగా గీతా విశ్వనాథ్

పిఠాపురం: కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతా విశ్వనాథ్ విమర్శించారు. నీరు అందక సాగు నిలిచిపోయిందని, కాలువ గట్లకు పడిన గండ్లను సక్రమంగా పూడ్చడం లేదని ఆమె వద్ద గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాలకు చెందిన పలువురు రైతులు వాపోయారు. దీంతో స్పందించిన ఆమె రైతులతో కలసి సోమవారం వివిధ రైతు సమస్యలపై పిఠాపురం పాడా కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారన్నారు. దీనిపై తాము రైతుల తరఫున పోరాటం చేస్తే గాని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. తీరా ధాన్యం కొనుగోలు చేసినా వాటికి సంబంధించిన సొమ్ము నెలలు గడుస్తున్నా వేయడం లేదన్నారు. దీంతో రైతు పెట్టుబడులు లేక అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఒకపక్క ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం ద్వారా అందక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏలేరు, పీబీసీ కాలువలకు పడిన గండ్లు పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సాయం అందించకపోవడం దారుణమన్నారు. కేంద్రం ఇచ్చిన వాటా కూడా ఇవ్వకుండా రైతులతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతుందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీటి ఎద్దడి వల్ల తీవ్ర ఆలస్యమైందన్నారు. సాగునీటి విషయంలో ప్రభుత్వం పట్టించుకోక జూలై వచ్చినా ఆకుమడులు పడలేదన్నారు. జూన్ 1వ తేదీనే సాగునీరు వదిలినట్టు చెప్పారని, కానీ జూలై వచ్చి 15 రోజులైనా ఇప్పటికి కనీసం నారుమడులకు కూడా నీరందలేదన్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖాధికారులు వెంటనే స్పందించి సాగునీరు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ఆమె కోరారు. గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగ లోవరాజు, అరిగెల రామయ్యదొర, దాసం వెంకటేష్, అధిక సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్



పీజీఆర్ఎస్‌లో అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ఇందులో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి నాలుగు అర్జీలు అందాయన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖాధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ అధికారి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహ పూర్వక వాతావరణంతో కేసుల పరిష్కారం



మున్సిపల్ సెంటర్‌లో వన్ కే వాక్‌నుద్దేశించి ప్రసంగిస్తున్న జడ్జి చంద్రమౌళేశ్వరి

పెద్దాపురం: స్నేహ పూర్వక వాతావరణంలో కేసులను పరిష్కరించుకోవాలని పెద్దాపురం ఏడో అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళేశ్వరి అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం 'మీడియేషన్ ఫర్ నేషన్' వారోత్సవాల్లో భాగంగా వన్ కే వాక్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి చంద్రమౌళేశ్వరి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారుల సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. దీనికి సంబంధించి ఏడుగురు న్యాయవాదులు ఉన్నారన్నారు. ఈ మధ్యవర్తులు కేసుల్లో ఉన్న ఇరువర్గాల వారిని తమ సమస్యను పరిష్కరించుకునే విధంగా స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తామన్నారు. కుటుంబ కేసులు, ఆస్తి తగాదాలు, క్రిమినల్ కేసులు, మోటార్ వాహనాల కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి దీప దైవకృప, జూనియర్ సివిల్ జడ్జి ఎల్.దేవిరత్న కుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తటవర్తి సత్యనారాయణ, సీఐ విజయశంకర్, ఎస్ఐ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీర్చేందుకు అండగా ఉందాం..

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పిలుపు



వంగా గీతకు కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ పదవులు చేపట్టిన నాయకులు

పిఠాపురం: ప్రజల కష్టాలు తీర్చేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు అండగా నిలబడాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా గొల్లప్రోలుకు చెందిన మొగలి మాణిక్యాలరావు (అయ్యారావు)ను, గొల్లప్రోలు మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. కొత్తగా నియమితులైన నాయకులు సోమవారం పిఠాపురం పార్టీ కార్యాలయంలో ఆమెను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ వివిధ విభాగాల్లో నిష్టాతులైన కార్యకర్తలు, నాయకులను అధ్యక్షులుగా నియమించడం ద్వారా పార్టీకి మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన పదవులతో నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపించి, ప్రజలకు పార్టీ పట్ల నమ్మకాన్ని పెంచాలన్నారు. యూత్ వింగ్‌కు ఒమ్మి మల్లిఖార్జునరావు, మహిళా విభాగానికి ఖండవల్లి జ్యోతి, రైతు విభాగానికి లోకారెడ్డి అప్పన్నదొర, బీసీ సెల్‌కు నూజివీడు సూర్య, ఎస్సీ సెల్‌కు ఎద్దు లోవరాజు, ఎస్టీ సెల్‌కు పంజాబు సత్తిబాబు, మైనారిటీ సెల్‌కు షేక్ జిలానీ, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు బందా భగవాన్, స్టూడెంట్ వింగ్‌కు ఏడిద నరేష్, పంచాయతీరాజ్ వింగ్‌కు ముద్దునూరు కొండబాబు రాజు, ఆర్టీఐ వింగ్‌కు మాచెర్ల శ్రీనివాస్, వలంటీర్ వింగ్‌కు చిలకల సతీష్, వీవర్స్ వింగ్‌కు శీరం అబ్బు, వాణిజ్య విభాగానికి కందా పేర్రాజు, వైఎస్సార్‌టీయూసీకి నెల్లి రామేశ్వరరావు, కల్చరల్ వింగ్‌కు తీర్ల నేరియ్య, సోషల్ మీడియా వింగ్‌కు ఓరుగంటి సత్య నూకరాజు, దివ్యాంగుల వింగ్‌కు ఓరుగంటి శ్రీను, పబ్లిసిటీ వింగ్‌కు ఓరుగంటి ప్రసాద్ తదితరులు నియమితులైన సందర్భంగా ఆమెను కలసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై పార్టీ పెట్టిన గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామని నాయకులు అన్నారు. కార్యక్రమంలో గండేపల్లి బాబీ, గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగ లోవరాజు, గొల్లప్రోలు మండల పార్టీ అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రావుల మాధవరావు, అడపా రఘు, రాష్ట్ర యువజన విభాగం నాయకులు మాదిరెడ్డి దొరబాబు, ఉలవల భూషణం తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మున్సిపల్ విభాగ ప్రధాన కార్యదర్శి మొగలి అయ్యారావును సత్కరిస్తున్న వంగా గీత

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కుమారరామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో వేచి ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలో నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర ప్రసాదంగా, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం శెనగలు, పులిహోర ప్రసాదంగా ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాదికాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ నెల 23న అమ్మవారికి శాకంబరిగా అలంకరణ ఉంటుందని చెప్పారు. ఈ అలంకరణకు కూరగాయలు ఇచ్చే దాతలు తమ పేర్లను ముందుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా స్థానిక మఠం సెంటర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం, ఐదు తూముల వద్ద రామలింగేశ్వరస్వామి ఆలయం, గొంచాల, పీబీ దేవం గ్రామాల్లోని శివాలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



మరిడమ్మను శాకంబరిగా అలంకరించేందుకు కూరగాయలను సిద్ధం చేస్తున్న భక్తులు

నేడు శాకంబరిగా మరిడమ్మ

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఈఓ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు శాకంబరి అవతారంలో దర్శనమిస్తారు. ఏటా పట్టణంలోని లక్కీ షాపింగ్ మాల్ వారి ఆర్థిక సహకారంతో వివిధ కూరగాయలతో అమ్మవారిని అలంకరిస్తున్నామన్నారు. అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు.

నేడు గడియార స్తంభం ప్రారంభం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో నిర్మించిన గడియార స్తంభాన్ని మంగళవారం సాయంత్రం ఏడు గంటలకు మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. ఆయన యానాం వెళుతూ మార్గం మధ్యలో ఉన్న గడియార స్తంభాన్ని తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, డీఈ కె.శశిధర్, ఎఈ బి.నరసింహారావు, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అడబాల కుమారస్వామి పాల్గొన్నారు.

విద్యార్థినులకు భద్రత కల్పించండి



కాకినాడ సఖి వన్‌స్టాప్ విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న డాక్టర్ శైలజ

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులు చోటుచేసుకోవడంతో రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించింది. కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ సోమవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, జీజీహెచ్‌లను సందర్శించారు. విద్యార్థులు, బోధకులతో సమావేశమయ్యారు. జీజీహెచ్‌లో వన్‌స్టాప్ సెంటర్‌ను, మెడికల్ ల్యాబ్‌లు, ప్రసూతి వార్డులను పరిశీలించారు. అంతకు ముందు, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ సహా ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ఐసీసీ)తో సమావేశమయ్యారు. మూడు కీలక సూచనలు చేశారు. ఫిర్యాదు చేసిన విద్యార్థులకు భద్రత కల్పించాలన్నారు. ఐసీసీ కార్యకలాపాలు, శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన విస్తృతం చేయాలని సూచించారు. శిక్షణకు వెళుతున్న విద్యార్థినులు పనిచేసే వార్డులు, ల్యాబ్‌లు, ఫార్మసీ యూనిట్లు, ఇతర ప్రాంతాల్లో సీసీ కెమేరాలతో సహా పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వన్‌స్టాప్ సెంటర్ వెన్నెముక

మహిళల సమస్యలు తమ దృష్టికి తేవడంతో పాటు తక్షణ సాంత్వన కల్పించడంలో వన్‌స్టాప్ సెంటర్ మహిళా కమిషన్‌కు వెన్నెముకగా పనిచేస్తోందని శైలజ అన్నారు. ఆర్ఎంసీ నుంచి జీజీహెచ్‌కు వచ్చిన ఆమె సఖి వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అడ్మిన్ శైలజ సెంటర్ కార్యకలాపాలు, దీనార్థ మహిళలకు అందించిన భరోసా, భద్రతను వివరించారు. అనంతరం లైంగిక వేధింపులు చోటు చేసుకున్న వార్డులను పరిశీలించారు. గైనకాలజీ విభాగంలో ప్రసూతి, ఇతర సేవలను పర్యవేక్షించారు. జేసీ రాహుల్ మీనా, అదనపు ఎస్పీ దేవరాజ్ పాటిల్, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు ఉమామహేశ్వరరావు, శశి, బయో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేంద్ర, డిప్యూటీ కలెక్టర్, జీజీహెచ్ అడ్మిన్ శ్రీధర్, ఐసీడీఎస్ పీడీ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.